క్లుప్తంగా

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

దౌల్తాబాద్: మండలంలో సోమవారం 1 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియదర్శిని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేడు వీరభద్రేశ్వరుడి జాతర



వీరభద్రేశ్వరుడి మూల విరాట్

దుద్యాల్: ఈర్లపల్లి గ్రామ శివారులోని గుట్టపై ఉన్న వీరభద్రేశ్వర స్వామి జాతర సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..మండలంలోనే అతి పెద్ద ఆలయం ఇక్కడ నిర్మించామని, ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఇక్కడ జాతర నిర్వహిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మండల వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవాలని వారు సూచించారు.

పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిందే

సీపీఎం ప్రజాసంఘాల డిమాండ్

తాండూరు టౌన్: 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో చట్టం చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రానికి ఆమోదం కోసం పంపిందని తెలిపారు. కానీ కేంద్రం కాలయాపన చేస్తు మోసం చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్ కల్పించనున్నారని భావించి, కేంద్రం మత రాజకీయాలకు పాల్పడుతూ విమర్శలు చేయడం బాధాకరం. రిజర్వేషన్లనేవి ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సమాన అవకాశాల కల్పన కోసమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపి, షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు చంద్రయ్య, కృష్ణ, ఆశీర్వాదం, బస్వరాజ్, రత్నం తదితర నాయకులు కోరారు.

శ్రీరామ మందిర్ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్

తాండూరు టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌లో పునర్నిర్మిస్తున్న శ్రీరామ మందిరానికి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎం శ్రీనివాస్ రూ. 51వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరామ మందిర్ పునర్నిర్మాణంలో తన వంతు సాయం అందజేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో సైతం మరింత సహాయ సహకారాలు అందజేస్తానని పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భక్తులు ధన లేదా వస్తు రూపంలోనైనా సహాయం చేయొచ్చని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రారంభమైన ఆరాధనోత్సవాలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి 3 రోజుల పాటు నిర్వహించనున్న ఆరాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. 6గంటలకు సుప్రబాతసేవ, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గురుపూజ నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణవాసులు తదితరులు పాల్గొన్నారు.

‘యంత్రలక్ష్మి’ అమలయ్యేనా?



దౌల్తాబాద్ శివారులో సాగు చేస్తున్న పత్తి

- ఏడేళ్లుగా నిలిచిన పథకం
- మూడేళ్లుగా విత్తన పంపిణీలోనూ కోత
- ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ సబ్సిడీ పథకాలకు ప్రభుత్వం మంగళం పాడడంతో అవస్థలు పడుతున్నారు. గతంలో యంత్రలక్ష్మి పథకం ద్వారా వ్యవసాయ పరికరాలు అందజేసేవారు. కొన్నేళ్లుగా ఆ పథకం ద్వారా వ్యవసాయానికి యంత్రాలు పంపిణీ చేయాలని ప్రభుత్వ అధికారులను పలుమార్లు వేడుకుంటున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను అందజేయడంలేదు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలుండగా సుమారు 25వేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. అందులో పత్తి, కంది, వరి, పెసర, మినుము తదితర పంటలను సాగు చేస్తున్నారు.

పెరిగిన ధరలతో నిరాశ

అన్నదాతలకు వ్యవసాయం పెనుభారంగా మారుతోంది. అమాంతం పెరిగిన ధరలతో నిరాశ చెందుతున్నారు. ఆ తరుణంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచనలు ఇస్తుందే తప్పా సబ్సిడీ విత్తనాలు వ్యవసాయ పరికరాలు అందించడంలేదు. దీంతో రైతులు వ్యవసాయంపై నిరాసక్తి కనబరుస్తున్నారు.

నిధులు కరువు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక సాగులో యాంత్రీకరణ తెచ్చేందుకు ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, రోటోవేటర్లు, నాగళ్లు, పవర్ స్ప్రేలు తదితర పరికరాలను రాయితీపై అందించేందుకు యంత్రలక్ష్మి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా ఈ పథకానికి నిధులు లేక 2018 నుంచి నిలిపివేశారు. రెండేళ్లుగా విత్తనాల్లోనూ రాయితీ నిలిపేసింది. దీంతో బహిరంగ మార్కెట్లో అన్నదాతలు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు.

పరికరాలు అందజేయాలి



ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలను రైతులకు అందించాలి. వ్యవసాయ పరికరాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వ్యవసాయ శాఖ నుంచి వివిధ రకాల పరికరాలు అందజేసేవారు.

– నర్సిములుగౌడ్, రైతు, దౌల్తాబాద్

వచ్చే అవకాశం ఉంది

ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి వ్యవసాయ పరికరాలు పంపలేదు. రెండు, మూడు నెలల్లో వచ్చే అవకాశం ఉంది. అవి రాగానే రైతులకు పంపిణీ చేస్తాం. యంత్రలక్ష్మి పథకం ఇప్పుడు అమలు చేయడంలేదు.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

రోడ్డు పక్కన చెట్ల నరికివేత

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రోడ్లపై చెట్లను నరకడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

పరిగి: పరిగి, షాద్‌నగర్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరు వైపుల అడ్డుగా వచ్చే చెట్లను, కొమ్మలను కొన్ని రోజులుగా నరికివేస్తున్నారు. ఈ విషయంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నరికి వేస్తుండటంతో ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతుందని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో చేరుకోవడం లేదని చెబుతున్నారు. భారీ చెట్లు, కొమ్మలు నరికినప్పుడు అవి రోడ్డుపై పడుతున్నట్లు దీంతో భారీగా ట్రాఫిక్ స్తంభించి పోతోందని చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన మామిడికుంట జాతర



ప్రత్యేక అలంకరణలో అంజన్న స్వామి



ఆలయంలో భక్తుల సందడి

దుద్యాల్: మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామ అటవీ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన మామిడికుంట ఆంజనేయ స్వామి జాతర ఆదివారంతో ముగిసింది. రెండు రోజులుగా కొనసాగిన ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తేరు వంటివి అంగరంగా వైభవంగా నిర్వహించారు. భక్తుల మొక్కుల చెల్లింపులో భాగంగా స్వామి వారి పేరుపై కోడెలను (పశువులు) దేవాలయం దగ్గరనే వదిలారు. అలాగే అక్కడ ఉన్న సీతారామ చంద్రులకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడవి ప్రాంతంలో ఆంజనేయ స్వామి వెలసి ఉండడంతో ఈ ప్రదేశాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ జాతర ఉత్సవాలకు దాదాపుగా 50 వేల మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ పూజారి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: తాము చదివిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి.. మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 1990లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బండారి చెన్నారెడ్డి, కనకమామిడి తిరుపతిరెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ముప్వ అమరేందర్ యాదవ్, మల్గారి లక్ష్మారెడ్డి, గడ్డం దయానంద్ కలిసి రూ.5లక్షల నిధులతో మరుగుదొడ్లు, మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించారు. చేవెళ్లకు చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో వారందరూ ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆదివారం వారందరూ కలిసి పనులను ప్రారంభించారు. పాఠశాలకు సహకారం అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని రెడ్డిశెట్టి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. దీంతో పాటు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా మరో లక్ష రూపాయలను పాఠశాల అభివృద్ధికి అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు సిద్ధం

- శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



అభయాంజనేయస్వామి ఆలయం

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠతో పాటు పోచమ్మ తల్లి, నాగబంధ, నాభిశిల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి మొదలుకొని ఐదు రోజుల పాటు 18వ తేదీవరకు ప్రతి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవ కార్యక్రమాలను శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మించామన్నారు. ఎంతో మంది దాతల సహకారంతో రూపుదిద్దుకున్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. గ్రామంలో ఐదురోజుల పాటు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయని తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

దుద్యాల్: హస్నాబాద్ గ్రామంలో వినాయక ఉత్సవ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. గ్రామ చావుడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గం ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, నాగేశ్వర్ రావు, మాణిక్యప్పలు, అధ్యక్షుడిగా నర్సింహ గౌడ్, ఉపాధ్యక్షుడిగా హన్మంతు, ఆశప్ప, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, కార్యదర్శులుగా రాములు, చంద్రప్ప, అంజిలప్ప, అశోక్, కోశాధికారిగా కిషన్ జీ, ఉపా కోశాధికారులుగా నర్సిములు, మహేశ్ గౌడ్‌లను ఎంపిక చేశారు. దీంతో పాటు అలంకరణ, భజన మండలి, సాంస్కృతిక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కలిసికట్టుగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలని, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాఖీ పండుగ సందర్భంగా ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచడం సరికాదన్నారు. పేదలపై పండుగ వేళ ఆర్థిక భారం మోపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. బస్‌స్టాప్‌లలో ప్రయాణికులు నిండుగా ఉన్నా బస్సులు మాత్రం సరిపడా నడపడం లేదని ఆరోపించారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉచిత బస్సు పథకం ప్రయాణికుల పాలిట శాపంగా మారిందన్నారు. పండుగ వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తరుణ్, శివ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కరన్‌కోట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

- సీసీఐ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన
- అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు వినతి

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం తాండూరు మండలం కరన్‌కోట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జాతిపిత గాంధీ విగ్రహాలకు కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌మార్ మాట్లాడుతూ..సీసీఐ కంపెనీలోని ప్యాకింగ్‌ప్లాంట్‌లో పని చేస్తున్న 119 కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం, కాంట్రాక్టర్ ఇరువురు కలిసి అకారణంగా తొలగించారన్నారు. పనులనుంచి తీసివేసి పది రోజులవుతున్నా ఇప్పటి వరకు వారిని విధుల్లోకి తీసుకోలేదన్నారు. దీంతో కార్మికుల జీవితాలు రోడ్డునపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం, కాంట్రాక్టర్ ఈ విషయంలో స్పందించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్నప్ప, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రత్నయ్య



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రత్నయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేద కుటుంబాలు సీఎం సహాయనిధిని వినియోగించుకుంటున్నాయన్నారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను అర్హులైన వారికి అందేల కృషి చేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందన్నారు. కాని కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక పేద ప్రజలకు అన్ని రకాల సంక్షేమాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, చంద్రయ్య, ఆనందం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాలతో సంతోషం

- సత్యసాయి గ్రామోత్సవాలను విజయవంతం చేయాలి
- రాష్ట్ర మెడికల్ సమన్వయ కర్త భాస్కర్‌రావు పిలుపు



మాట్లాడుతున్న భాస్కర్‌రావు

ధారూరు: శ్రీసత్యసాయి సేవాకార్యక్రమాలతో సంతోషం కలుగుతుందని రాష్ట్ర మెడికల్ సమన్వయ కర్త భాస్కర్‌రావు పేర్కొన్నారు. ధారూరు మండల పరిధిలోని కేరెళ్లి గ్రామ శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రంలో నిర్వహించిన వార్షికోత్సవ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 306 ఎంపిక చేసిన గ్రామాల్లో ఆగస్టు 23, 24 తేదీల్లో శ్రీసత్యసాయి గ్రామ ఆనందోత్సవ సంబరాల పేరిట నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. శ్రీసత్యసాయి సేవాదళ్ సభ్యులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ ఠాకూర్, కేరెళ్లి సార్వజనిక కేంద్రం ప్రధాన కార్యదర్శి ఎం. ప్రేమ్‌కుమార్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

సీనియర్ నాయకుడు కరణం ప్రహ్లాదరావు, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ప్రహ్లాదరావు, మారుతి కిరణ్

కుల్కచర్ల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని సీనియర్ నాయకుడు కరణం ప్రహ్లాదరావు, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ పేర్కొన్నారు. మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో భారత ప్రధాని నరేంద్రమోదీ సాధించిన ప్రగతి, చేపట్టిన సంక్షేమ పనులు, అమలు చేసిన ఆయా పథకాలపై కార్యకర్తలతో కలిసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెప్పి, మోసపూరిత హామీలతో అధికారంలోకొచ్చిందన్నారు. స్థానిక సంస్థల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రజలందరూ తమ పార్టీకి మద్దతివ్వాలన్నారు.

నేడు జన్వాడకు మంచు లక్ష్మీప్రసన్న

శంకర్‌పల్లి: మండలంలోని జన్వాడ గ్రామానికి సోమవారం ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మీప్రసన్న రానున్నారు. ‘టీచ్ ఫర్ చేంజ్’, వెనీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1000 మంది విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్, ప్లేట్స్ ఇవ్వనుండగా.. ఈ కార్యక్రమానికి ఆమె, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు టీచ్ ఫర్ చేంజ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆయుబ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇవే కాకుండా జన్వాడ ప్రభుత్వ పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులను సైతం నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దౌల్తాబాద్: రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. 18నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన రైతులు అర్హులన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఉండి, గతంలో దరఖాస్తు చేయని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు నమోదైన వారి వివరాల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందని పేర్కొన్నారు.

మార్పులకు అవకాశం

తాండూరు రూరల్: రైతు బీమాలో మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తాండూరు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమురయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రైతు బీమా దరఖాస్తు చేసుకున్న రైతులు నామిని, పుట్టిన తేదీ మార్పు కోసం ఈ నెల 12వ తేదీ వరకు చేసుకోవచ్చని సూచించారు. జూన్ 5వ తేదీ వరకు కొత్త పట్టాదారు పుస్తకం వచ్చిన వారు కూడా రైతు బీమా చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత జిరాక్స్ పత్రాలను ఏఈవోలకు సమర్పించాలని ఇన్‌చార్జి ఏడీఏ సూచించారు.

ధారూరులో..

ధారూరు: ఇంతవరకు రైతు బీమా చేసుకోని రైతులు, కొత్త పట్టాదారు పాసుపుస్తకం పొందిన వారు బీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ధారూరు మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్ ఆదివారం తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 5వ తేదీ వరకు కొత్త పాసుపుస్తకాలు పొందిన రైతులు చేసుకోవచ్చని సూచించారు.

బంట్వారంలో..

బంట్వారం: రైతు బీమా పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయ శాఖ బంట్వారం, కోట్‌పల్లి ఏఓలు శ్రావ్య, కరుణాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వేర్వేరుగా తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాపాస్ బుక్ వచ్చిన రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ జిరాక్స్ పత్రాలను దరఖాస్తు ఫారానికి జత చేసి ఈ నెల 13వ తేదీలోపు సంబంధిత ఏఈఓలకు అందజేయాలని పేర్కొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: నూతనంగా భూమి పట్ట పాసు పుస్తకం పొందిన రైతులు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 05-06-2025 నాటికి కొత్త భూమి పాసు పుస్తకం పొందిన వారు ఈ నెల 12వ తేదీ లోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీరస్వామి పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..కొత్త పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, జిరాక్స్‌లతో ఈ నెల 13లోపు స్థానిక రైతు వేదికలో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.